క్లుప్తంగా

దర్గాలో గ్యారాతారీఖ్ వేడుకలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం గ్యారాతారీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను, ప్రార్థనలను జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. చాల మంది భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: వచ్చేనెల 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు.11 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్నా ఆ హామీని మాత్రం నిలబెట్టుకోలేక పోయారన్నారు. మహాసభలకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్, రాజీవ్, తిమ్మగురుడు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ల కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తూ దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్‌పై విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ, ఆర్‌ఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు కృష్ణ, సురేంద్ర డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు గుడ్లు సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ అప్పగించిందన్నారు. అయితే టెండర్ పొందిన కాంట్రాక్టర్ నిబంధనల మేరకు 50గ్రాముల సైజు వున్న ఒక్కో గుడ్డును సరఫరా చేయాల్సి వుండగా పూర్తిగా చిన్న సైజు గుడ్లను సరఫరా చేస్తూ దోచుకుంటున్నాడని ఆరోపించారు. సమావేశంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు ఇమ్రాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ



వివరాలను అడిగి తెలుసుకుంటున్న వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

ఆదోని టౌన్: ఆదోని మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అనిల్‌కుమార్, యూనిసెఫ్ కన్సల్టెంట్ నాగేంద్ర, జిల్లా నాణ్యతాధికారి ముర్తుజావలి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌లు తనిఖీ చేశారు. ఇన్‌ఫెక్షన్ నియంత్రణ పద్ధతులు, పరిసరాల పరిశుభ్రత, గృహనిర్వాహక సేవలు, భద్రత, ల్యాండ్రీ సేవలను తనిఖీ చేశారు. నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు.

డీజేలకు అనుమతిలేదు



సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల : పెళ్లి వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ విజయ భాస్కర్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడారు. పెళ్లి వేడుకల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించే డీజేలను ఊరేగింపులకు ఉపయోగించరాదని సూచించారు. తక్కువ శబ్దం ఇచ్చే మైక్, డెక్కులను ఉపయోగించాలంటే డీఎస్పీ అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే డీజేలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం పేరు అక్రమ దందాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో ఆదోని పరిసర ప్రాంతాల్లో నిత్యం భూకబ్జాలు, అక్రమ రేషన్ బియ్యం దందా, ఇసుక దందాలు జరుగుతున్నాయన్నారు. షేక్షావలి, నాగరాజు, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సేవలు నిల్.. సర్వేలు ఫుల్!

- సచివాలయ సేవలకు స్వస్తి పలికిన కూటమి సర్కార్
- సిబ్బందితో వివిధ రకాల సర్వేలు
- సెలవురోజుల్లోనూ వారితో పనులు
- సర్టిఫికెట్ల కోసం మీ సేవా, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి



మండగిరి వార్డు సచివాలయం

ఆదోని సెంట్రల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సత్వరమే సేవలను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. అయితే వాటి సేవలకు కూటమి సర్కార్ స్వస్తి పలికింది. గత ప్రభుత్వంలో సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలను అందించే వారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సేవలను పక్కన పెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటా తిప్పుతోంది. దీంతో ప్రజలకు సచివాలయంలో సేవలు అందకపోవడంతో వారు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఉద్యోగులపై పని ఒత్తిడి

ఆదోని నియోజకవర్గంలో పట్టణ ప్రాంతంలో 42 గ్రామీణ ప్రాంతంలో 35 సచివాలయాలు ఉన్నాయి. అయా సచివాలయాల్లో దాదాపు 460 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక ఉద్యోగి చొప్పున ప్రతి సచివాలయంలో 11 మందిని నియమించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి క్యాస్ట్ సర్టిఫికెట్ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల వరకు అన్ని సేవలను సచివాలయంలోనే అందించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సేవలకు స్వస్తి పలకడమే కాకుండా సచివాలయాల సిబ్బందిపై వివిధ రకాల సర్వేల పేరుతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందనే విమర్శలు వినబడుతున్నాయి. సెలవు రోజుతో సంబంధం లేకుండా సర్వేలు చేయాలని అదేశించడం, టార్గెట్లు పెట్టడం, మాతృశాఖ పనులతో పాటు బీఎల్‌ఓ విధులు ఇలా అన్ని రకాల పనులను చేయాలని అదేశిస్తున్నారు. దీంతో తీవ్ర మానసికి ఒత్తిడికి గురవుతున్నారు. సర్వేల కోసం సచివాలయాల ఉద్యోగులు వీధివిదినా తిరగడంతో సచివాలయాలు నేడు వెలవెల బోతున్నాయి.

వివిధ రకాల సర్వేలు..

సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధార్ లేని పిల్లలను గుర్తించి వారికి అధార్ నమోదు చేయించాలి. పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికేట్, అధార్ నమోదు వంటి ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. వర్క్ ఫ్రం హోమ్ పేరుతో 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు ఉన్న వారి జాబితాను తయారు చేయాల్సి ఉంటుంది. పబ్లిక్, ప్రవేట్, పీపుల్ భాగస్వామ్యంతో పీ 4 సర్వే, నాన్ ఏపీ రెసిడెన్షియల్ వారిని గుర్తించడం, హౌస్ జియో ట్యాగింగ్ వంటి సర్వేలను చేయిస్తున్నారు. ఇంటింటా తిరిగి సర్వే చేస్తున్నా ఇంటి యాజమాని సెల్‌ఫోనుకు వచ్చిన ఓటీపీ చెప్పకపోతే చేసిన పని అంతా వృథా అవుతుంది. మరి మొదటి నుంచి చేయాల్సి ఉంటుందని పలువురు వాపోతున్నారు.

సంక్షేమ పథకాల ఊసేలేదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జానాభాకు ఒక సచివాలయన్ని ఏర్పా టు చేయడమే కాకుండా సచివాలయ సిబ్బందితో దాదపు 545 వివిధ రకాల సేవలను అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందిన పథకాలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డుగాని కొత్త పెన్షన్ గాని, ఇంటి స్థలం గాని వచ్చిన దాఖాలాలు లేవు.

అన్ని సేవలు అందేవి



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందేవి. ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలపై సమాచారం అందించే వారు. ఏవైనా పత్రాలు కావాలి అంటే దరఖాస్తు చేస్తే అక్కడే ఇచ్చే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పత్రాలు కావాలి అంటే మీ సేవా కేంద్రానికి లేదా మండల కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల అవసరాలు ఇబ్బందులను గుర్తించి సచివాలయ వ్యవస్థను పునరుద్ధరించి సేవలను అందిస్తే బాగుంటుంది.

– గౌస్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి

ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు



గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లి పనులను చేసుకునే వాళ్లం. సచివాలయంలో సేవలు లేక పోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మీ సేవా కేంద్రాలు, మండల కార్యాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు అందించాల్సిన సేవలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. చిన్న చిన్న వాటికి మీ సేవా కేంద్రాలకు, మండల కార్యాలయాల చుట్టూ తిరగాలి అంటే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. కూటమి సర్కార్ అలోచించి సచివాలయ సేవలను కొనసాగించాలి.

– బి. వీరేష్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

మేళిగనూరులో గంగపూజ



కలశాలతో, నదీజలాలతో వస్తున్న మహిళలు

కౌతాళం: మండల పరిధిలోని మేళిగనూరు గ్రామం తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవం ఈనెల 12న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా పాల్తూరు చెన్నవీరమహాస్వామిల ఆధ్వర్యంలో గురువారం తుంగభద్ర నదిలో ప్రత్యేక జల పూజలు చేసి, నది జలాలతో నూతన రథానికి కలశపూజ, గోమాత పూజ, హోమ కార్యక్రమాలను చేపట్టారు. అంతకు ముందు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ వంటి పూజల అనంతరం గంగపూజ నిర్వహించారు. పూజ కార్యక్రమంలో మేళిగనూరు గ్రామ ప్రజలతో పాటు నదిచాగి, కాత్రికి, కుంబళనూరు, కర్ణాటకలోని వివిధ గ్రామాలతో తరలివచ్చారు. 12న శనివారం జరుగు జాతర మహోత్సవం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెన్నవీర స్వామి తెలిపారు. జాతర మహోత్సవానికి సుమారుగా రూ.50లక్షలతో నూతన రథాన్ని తయారు చేసినట్లు ఆలయ ధర్మకర్త మల్లికార్జునస్వామి వెల్లడించారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సూచించారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. మే 10వ తేదీన స్థానిక కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, యాక్సిడెంట్ కేసులు, ఫైనాన్స్ కంపెనీకి చెందిన కేసులు, ఇతర పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజీ కాదగిన కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఏసీ కేసులకు సంబంధించిన న్యాయవాదులు, ఫైనాన్స్ కంపెనీకి చెందిన న్యాయవాదులు, ఇతర సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: జాతీయ సర్వే దినోత్సవాన్ని గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ముఖ్య అతిథిగా హాజరై సర్వేశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సేవలను ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ సర్వేశాఖ ఉద్యోగులు చేపడుతున్న సేవలు అమూల్యమైనవన్నారు. వారి కృషితో భూసర్వే విధానాలు మరియు భూసాంకేతిక రంగాలు నూతన దిశగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అనంతరం కేకు కట్ చేసి సర్వేయర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఉప తహసీల్దార్లు గుండాల నాయక్, పెద్దయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ వేణుసూర్య, మండల సర్వేయర్ ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

నందవరంలో వేడుకలు

నందవరం : మండల కేంద్రం నందవరంలోని రెవెన్యూ కార్యాలయంలో జాతీయ సర్వే దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు బ్రిటిష్ సర్వేయర్ కర్నల్ విలియం లాంప్టన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి వేడుకలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, డీటీ శశిశేఖర్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, ఆర్ఐ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో జీసెస్ టెంపుల్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి కంటి వైద్య పరీక్షలను ప్రముఖ కంటి వైద్యుడు హేమంత్‌కుమార్ నిర్వహించారు. వారిలో 30 మందికి శస్త్ర చికిత్సలను ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ కింద చేసేందుకు రెఫర్ చేశారు. శిబిరాన్ని పట్టణ సీఐ శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయవాది చార్లెస్, మల్లేష్, డేవిడ్, షాలెం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోపుర కలశ ఊరేగింపు



ఆలయ గోపుర కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర స్వామి ఆలయ గోపుర కలశ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి డప్పువాయిద్యాలు, కలశాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకున్నారు. ఆలయంలో ఆదోనికి చెందిన వేదపండితులు గరుడాద్రి వెంకట సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, ఆకు పూజ, గణపతి పూజ, వెండి కవచ అలంకరణలు గావించారు. ఆలయం ప్రాంగణంలో భక్తులచే హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువ జామున గోపర కలశ స్థాపన పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ కాత్యాయిని

కోసిగి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ కాత్యాయిని అన్నారు. గురువారం స్థానిక 11వ అంగన్‌వాడీ కేంద్రంలో 9, 12,18,19వ అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి పౌష్టికాహార పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఎక్కువగా ఆకు కూరగాయాలు, పండ్లు, చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, వెంకటమ్మ, నాగలక్ష్మి, నాగవేణి, లత, ఆయాలు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరం లేక వాయిదా పడింది. గురువారం చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో 42 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 38 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. బీజేపీ మద్దతు కౌన్సిలర్లు నలుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. నలుగురు సభ్యులతో సమావేశం నిర్వహించలేక వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. ఈనెల 16వ తేదీన చైర్‌పర్సన్ బోయ శాంతపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం కారణంగా సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది.

మహిళ ఆత్మహత్య

ఆదోని అర్బన్: పట్టణంలోని శంకర్‌నగర్‌కు చెందిన షేక్ ముంతాజ్(50) కడుపునొప్పి తాళలేక పెండరంగు నీళ్లల్లోకి కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త మదన్‌వలి టూటౌన్ పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. కొన్ని రోజులుగా ముంతాజ్‌కు కడుపునొప్పి ఉండేదని, నొప్పి తాళలేక మనస్థాపానికి గురై పెండరంగును నీళ్లల్లోకి కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరుకుందన్నారు. వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు ధ్రువీకరించారన్నారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణంలో డీఎస్పీ బంగ్లా రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టూటౌన్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. రెహమాన్, హనుమేష్‌లు ఆటోలో బియ్యం తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని, 10 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఆటోను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆదోని ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. నాయకులు ఆరోగ్యప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరాజు, రామలింగప్ప మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ రద్దు చేసి ఆర్టీసీ పాత వైద్యవిధానాన్ని కొనసాగించాలన్నారు. కొత్త విద్యుత్ బస్సులు ఆర్టీసీ ద్వారానే నడపాలన్నారు. నాయకులు వీరేష్, నాగరాజు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ఆదోని టౌన్: యూపీహెచ్‌సీ షరాఫ్ బజార్ స్టాఫ్ ద్వారా గురువారం పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ చేసినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు వైద్యుల సూచన మేరకు మెరుగైన పౌష్టికాహారం తీసుకుని, మందులు వాడితే జబ్బు నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు షేకున్‌బాను, వినోద్‌కుమార్, యూపీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది బాబురాజు, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

ఎమ్మిగనూరుటౌన్: 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లిస్తే 5శాతం రాయితీని పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గురువారం తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీలోగా ముందస్తు ఆస్తి పన్ను చెల్లించేందుకు అవకాశం వుందన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని బిల్లుల చెల్లింపు కౌంటర్లలో కానీ, వార్డు సచివాలయాల్లో కానీ, ఆన్‌లైన్‌లో కానీ చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైనారిటీల అణచివేతకే వక్ఫ్ చట్ట సవరణ బిల్లు

ఎమ్మిగనూరుటౌన్: దేశంలో ముస్లిం మైనారిటీలను అణచివేసేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణ బిల్లు తెచ్చిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాశింవలి ఆరోపించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మతస్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అన్నారు. ఈబిల్లు ఉద్దేశం మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్పా మరొకటి కాదన్నారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో దేశంలోని 20కోట్ల మంది ముస్లింలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ బిల్లుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ముస్లింల ద్రోహి అన్నారు.

పిల్లల చదువుకు ఆటంకం కలిగించొద్దు



డ్రాప్ అవుట్ పిల్లలతో జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్

ఆదోని సెంట్రల్: బడిఈడు పిల్లల చదువుకు ఆటంకం కలిగించవద్దని జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్ పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. గురువారం పురపాలక ఉన్నత పాఠశాలలో డ్రాప్ అవుట్ అయిన పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉంటే వలస వెళ్లే సమయంలో పిల్లలను సీజనల్ హాస్టళ్లలో వదలాలన్నారు. జిల్లాలో 15,400 మంది డ్రాప్ అవుట్స్ ఉన్నట్లు గుర్తించామన్నారు. మండల విద్యాధికారులు అధికారుల చేత స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బడి ఈడు పిల్లలను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో చనిపోయిన వారు, పెళ్లిళ్లు చేసుకున్నవారు, పదో తరగతి వరకు చదువుకుని ఆర్థికపరమైన ఇబ్బందులతో చదువు మానేసిన వారు ఉన్నారన్నారు. వారందరినీ తీసివేసి అసలైన డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఆదోని నియోజకవర్గంలో 6,444 మంది డ్రాప్ అవుట్స్ ఉంటే అందులో 6,250 మందిని గుర్తించి, 72 మందిని బడిలో చేర్పించినట్లు తెలిపారు. పెద్దకడబూరు 91 మందిని, ఎమ్మిగనూరులో 74 మంది విద్యార్థులను బడిలో చేర్పించినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రతి పిల్లవాడు బడిలో ఉండాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు, పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అలీం సిద్ధికీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలని ఎస్టీయూ నాయకులు నాగరాజు, వీరచంద్రయాదవ్, రమేష్‌నాయుడు, కె.రవి, భీమరాజు డీఈఓకు వినతిపత్రం అందజేశారు. అలాగే మున్సిపల్ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై చొరవ చూపాలని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ విన్నవించారు.

పిల్లలకు బంగారు భవిష్యత్తు అందిద్దాం

పెద్దకడబూరు : బడి భయట పిల్లలకు బంగారు భవిషత్‌ను అందిద్దామని జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని 26గ్రామాలలో మండల విద్యాధికారులు సువర్ణల సునీయం, రామమూర్తి ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గత వారం రోజులు గా పర్యటించి 85మంది బడి చిన్నా రులను గుర్తించారు. వారితో పాటు తల్లిదండ్రులను గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలకు తీసుకొచ్చారు. వారందరినీ డీఈఓ ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేర్పించారు.

రాజకీయ నాయకులతో సమావేశం

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా ఆదోని నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఫారం 6, 7, 8 నూతన ఓటర్ నమోదు, చిరునామా తదితర అంశాలపై గురువారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ కౌతాళం మండలశాఖ నాయకులు కోరారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యుడు మహాదేవప్ప, జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావొస్తోందని, 2023 పీఆర్‌సీ కమిషన్ నియమించక పోవడం వల్ల పీఆర్‌సీ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మనోహర్, లక్ష్మన్న, రాజేష్, రామాంజనేయులు, అంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ అభివృద్ధికి ఏజెంట్లే కీలకం

ఎమ్మిగనూరుటౌన్: ఎల్ఐసీ అభివృద్ధికి ఏజెంట్లు, సిబ్బందే కీలకమని స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ పులినాయక్, ఏఓ మహేష్‌కుమార్, సీనియర్ బిజినెస్ అడ్వైజర్ పాటిల్ తిమ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం సందర్భంగా అర్చకులు రఘునందన్ స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముస్కాన్ అనే విద్యార్థిని జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజు, నరసింహరాజు తెలిపారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ జనవరిలో అండర్–14 కింద సత్యసాయి జిల్లా హిందూపూరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి 31వ తేదీ వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

ఆర్థిక సాయం

విద్యార్థి ముస్కాన్‌ది నిరుపేద కుటుంబం, వాళ్ల నాన్న మస్తాన్ ఆటో నడుపుకుంటూ కుటుంబం పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో విద్యార్థిని జాతీయ పోటీలకు పంపించేందుకు విముఖత చూపడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు నాయకులను ఆశ్రయించారు. దీంతో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి విద్యార్థిని అభినందించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డిని కలిసి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.